క్లుప్తంగా

స్మార్ట్ మీటర్ల ఆలోచన విరమించుకోవాలి



సబ్‌స్టేషన్ వద్ద ఏఈ వెంకట్రావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

దేవరపల్లి: విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి బడా కంపెనీలకు రూ.వేలాది కోట్లు దోచి పెట్టాలనే ఆలోచనను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా నేత, రైతు సంఘం నాయకుడు ఉండవల్లి కృష్ణారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలపై ఎలాంటి విద్యుత్ భారం వేయబోమని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఈ సందర్భంగా కృష్ణారావు గుర్తు చేశారు. ఇచ్చిన హామీకి విరుద్ధంగా ట్రూ ఆఫ్ చార్జీల పేరిట ప్రజలపై భారం వేస్తోందని విమర్శించారు. ఆ భారాన్ని ప్రభుత్వం భరించాలని ఆయన అన్నారు. స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజలపై దాదాపు రూ.20 వేల కోట్లు భారం వేయడానికి ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమైన చర్య అని కృష్ణారావు తప్పుబట్టారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం వేస్తే వారి పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏఈ సీహెచ్ వెంకట్రావుకు వినపత్రం అందజేశారు. కార్యక్రమంలో కె. రత్నాజీ, పిన్నమనేని సత్యనారాయణ, మడెల్లి రామారావు, ఎస్. భగత్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనుల పరిశీలన

నిడదవోలు: మున్సిపల్ సాధారణ నిధులు రూ.2.70 లక్షల వ్యయంతో పట్టణంలోని ఏడో వార్డులో చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ అధికారులతో కలసి పరిశీలించారు. ప్రధాన సెంటర్‌లోని కల్వర్టు పనులను వేగంగా పూర్తి చేయాలని చైర్మన్ ఆదినారాయణ అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్లు ముంగండి మాణిక్యమాల, కారింకి నాగేశ్వరరావు, నాయకులు మద్దిపాటి ఫణీంద్ర, బాల బాలాజీ, గంగుల గోపియాదవ్, చల్లాబత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెం శివార్లలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై చాగల్లు పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఎస్సై కె.నరేంద్ర ఆధ్వర్యంలో జరిపిన ఈ దాడిలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.20,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై నరేంద్ర హెచ్చరించారు.

అదానీని అరెస్టు చేయాలి

నిడదవోలు: భారీ కుంభకోణానికి పాల్పడిన పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని తక్షణమే అరెస్టు చెయ్యాలని సీపీఎం జిల్లా నాయకుడు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. గౌతమ్ అదానీ, ఆ గ్రూపునకు చెందిన మరో ఆరుగురిపై అమెరికా న్యాయస్థానంలో కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గౌతమ్ అదానీని అరెస్టు చెయ్యాలంటూ సీపీఎం ఇచ్చిన దేశవ్యాప్త పిలుపు మేరకు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గండి శ్రీనివాసరావు, కె. గోపి ఓ. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వనిధి రుణాలపై అవగాహన ర్యాలీ



నిడదవోలులో వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న మెప్మా సిబ్బంది

నిడదవోలు: వీధి వ్యాపారులు, స్వయం సహాయక సంఘ సభ్యులు స్వనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు అధికారులు సూచించారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)ఆధ్వర్యంలో శుక్రవారం స్వనిధి రుణాలపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వీధి వ్యాపారులకు స్వనిధి, స్వాభిమాన్ బీ, పఖ్వాడ పథకాలకు సంబంధించి డిజిటల్ యాక్టివేషన్ చేపట్టారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ అధికారి అభిషిక్త, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఎ. జ్యోతి, ఆర్పీలు, స్వనిధి లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెరిగిన పెట్టుబడి.. తగ్గిన దిగుబడి

- రైతులు గట్టెక్కినా.. కౌలుదారులకు తప్పని నష్టాలు
- డివిజన్ వ్యాప్తంగా 34,625 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు
- ఇప్పటి వరకూ 18,955 హెక్టార్లలో పంట ఒబ్బిడి
- ఎకరానికి 30 నుంచి 35 బస్తాల దిగుబడి



కానూరులో యంత్రం సాయంతో పంట నూర్పిడి



ఉసులుమర్రులో ధాన్యాన్ని బస్తాలకు పడుతున్న కూలీలు

పెరవలి: ఖరీఫ్ సాగు రైతులకు మిశ్రమ ఫలితాలు ఇచ్చింది. ఈ సీజన్‌లో పంట దిగుబడులు ప్రాంతాన్ని బట్టి ఎకరానికి 25 నుంచి 35 బస్తాలు మాత్రమే వచ్చాయి. ఈ దిగుబడులు పెట్టుబడులకు సరిపోతున్నాయని రైతులు చెబుతుండగా, తమకు నష్టాలు వచ్చాయని కౌలుదారులు వాపోతున్నారు. వరి పైరు ఈనిక సమయంలో కురిసిన అధిక వర్షాలకు పూత రాలిపోయింది. కొంతమేర తెగుళ్లు కూడా సోయాయి. గింజ గట్టిపడే సమయంలో అధిక ఉష్ణోగ్రతల వలన ధాన్యపు గింజలు నొక్కుకుపోయాయి. ఇవి దిగుబడిపై ప్రభావం చూపాయని అన్నదాతలు చెబుతున్నారు. మెరక భూముల్లో ఎకరానికి 30 నుంచి 35, పల్లపు పొలాల్లో 25 నుంచి 30 బస్తాల దిగుబడి వచ్చినట్టు రైతులు చెబుతున్నారు. రైతు తమ ధాన్యాన్ని ఎక్కడైనా అమ్ముకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. దానిని ఆసరాగా తీసుకుని దళారీలు కళ్లాల వద్దకు వెళ్లి తక్కువ ధరకు ధాన్యానికి కొనుగోలు చేశారు. అదే సమయంలో వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు కంగారు పడి వచ్చిన రేటుకు ధాన్యాన్ని విక్రయించేశారు. ఈ క్రమంలో వారికి ఆశించిన రేటు కూడా దక్కలేదు.

డివిజన్ పరిధిలో ఇలా..

కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్‌లో 34,625 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. ఇప్పటి వరకూ 18,980 హెక్టార్లలో వరికోతలు పూర్తయ్యాయి. నిడదవోలు నియోజకవర్గంలో 34 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, ఇప్పటి వరకూ 55 శాతం విస్తీర్ణంలో పంట ఒబ్బిడి అయ్యింది. కోతలు జరిగిన ప్రాంతాల్లో కొత్త విత్తనాలు, పీఎల్, సన్న రకాలు సాగు చేసిన రైతులకు ఎకరానికి 25 బస్తాలు దిగుబడులు వస్తున్నాయి. స్వర్ణ రకాలు సాగు చేసిన వారికి 30 నుంచి 35 బస్తాల దిగుబడులు వస్తున్నాయి. ఖరీఫ్ సాగుతో తాము నష్టపోయామని కౌలుదారులు పేర్కొంటున్నారు. ఎకరం విస్తీర్ణంలో పండిన ధాన్యంలో 14 బస్తాలు కౌలుగా రైతుకు చెల్లిస్తే, మిగిలిన 20 బస్తాల ధాన్యం విక్రయిస్తే వచ్చే సొమ్ము పెట్టుబడులకు సరిపోతోందని చెబుతున్నారు. ఎకరానికి పెట్టుబడి రూ.22 వేలు అయితే దిగుబడులు 30 నుంచి 35 బస్తాలు వస్తున్నాయని వివరిస్తున్నారు.

రిస్క్ ఎందుకులే.. క్యాష్ ఇస్తున్నారుగా

తాము పండించిన ధాన్యాన్ని రైతులు ఎక్కడైనా అమ్ముకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో ధాన్యం దళారీలకు గేట్లు ఎత్తివేసినట్టు అయ్యింది. దళారీలు స్వయంగా పంట చేల వద్దకు వెళ్లి కోసిన ధాన్యం బస్తా ఒక్కంటికి రూ.1450 చొప్పున వెంటనే క్యాష్ ఇస్తామని, అదే ఆరుదల ధాన్యానికి రూ.1740 చొప్పున చెల్లిస్తామని ప్రతిపాదిస్తున్నారు. రైతులు తమ తక్షణ ఆర్థిక అవసరాల కోసం ధాన్యాన్ని అదే రేటుకు అమ్ముకుంటున్నారు. వాతావరణం కూడా రోజుకో విధంగా ఉండడంతో 'రిస్క్ ఎందుకులే.. క్యాష్ ఇస్తున్నారుగా' అని రైతులు దళారీల చెప్పిన రేటుకే అమ్మేస్తున్నారు.

రబీ ఆదుకుంటేనే గట్టెక్కేది



ఖరీఫ్ పంట నష్టాలు తెచ్చి పెట్టింది. కొత్త రకం వంగడాల సాగు, పల్లపు భూములు కావడం వల్ల ఎకరానికి 25 నుంచి 30 బస్తాల దిగుబడులు వస్తున్నాయి. కౌలు కింద 14 బస్తాలు చెల్లించాలి. మిగిలింది పెట్టుబడుల కింద పోతోంది. రబీ పంట రక్షిస్తే గట్టెక్కగలుగుతాం.

– అల్లం రాజు, కౌలు రైతు, పెరవలి

గతేడాదితో పోలిస్తే తగ్గింది



గతేడాదితో పోలిస్తే ప్రస్తుత ఖరీఫ్‌లో ధాన్యం దిగుబడులు తగ్గాయి. కొవ్వూరు డివిజన్‌లో ఈ సీజన్‌లో దిగుబడులు సరాసరిన 30 నుంచి 35 బస్తాలు వస్తున్నాయి. పల్లపు చేలల్లోను, కొత్త రకం విత్తనాలు, పీఎల్ వంటి రకాలు సాగు చేసిన రైతులకు ఎకరానికి 25 నుంచి 35 బస్తాల దిగుబడి మాత్రమే వస్తోంది.

– పి చంద్రశేఖర్ ఏడీఏ, కొవ్వూరు డివిజన్

పాదయాత్ర భక్తులకు పుణ్య సమారాధన



దూబచర్లలో అన్న సమారాధన చేస్తున్న భక్త బృందం

నల్లజర్ల: వివిధ గ్రామాల నుంచి పాదయాత్రగా ద్వారకాతిరుమల వెళుతున్న భక్తులకు మండలంలోని దూబచర్ల శివారు అడ్డరోడ్డు వద్ద శుక్రవారం భక్త బృందం అన్నసమారాధన చేసింది. కాసానిబాట గంగేశ్వరరావు ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి గుడి వద్ద దాదాపు 4 వేల మందికి అన్న సమారాధన చేశారు. గత ఏడేళ్లుగా ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గంగేశ్వరరావు (బాటయ్య)తెలిపారు. ఆలయ పురోహితుడు సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక మాసంలోని అన్ని శుక్రవారాలూ అన్న సమారాధన జరుగుతుందని బాటయ్య తెలిపారు. పుల్లలపాడు, దూబచర్ల వైఎస్సార్ కాలనీ భజన బృందం సభ్యులు భక్తులకు ఆహారం, మంచినీరు అందించారు.

పెరవలి: మల్లేశ్వరం గ్రామంలోని పుంతలో ముసలమ్మ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. పెండ్లి భోజనాలను తలపించేలా 12 రకాల పిండి వంటలతో ఈ కార్తిక వన సమారాధన జరిగింది. సుమారు 3 వేల మంది ఈ అన్న సమారాధనలో పాల్గొన్నారు.

తాడిమళ్ల చోళ్లమ్మ గుడి వద్ద..

నిడదవోలు రూరల్: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని తాడిమళ్ల చోళ్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు చోళ్లమ్మను దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ప్రజల అర్జీలకు బాధ్యతాయుత పరిష్కారాలు

- పీజీఆర్ఎస్ జిల్లా నోడల్ అధికారి వీణాదేవి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పీజీఆర్ఎస్ జిల్లా నోడల్ అధికారి వీణాదేవి

కొవ్వూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులకు బాధ్యతాయుత పరిష్కారాలు చూపాలని పీజీఆర్ఎస్ జిల్లా నోడల్ అధికారి పి.వీణాదేవి సూచించారు. పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై డివిజన్ పరిధిలోని మండల స్థాయి అధికారులకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజల నుంచి అందే ఫిర్యాదుల పరిష్కారంపై ఆడిట్ నిర్వహించనున్నట్టు ప్రకటించారు. సర్వీస్ లెవెల్ అగ్రిమెంట్ (ఎస్ఎల్ఏ) ప్రకారం ప్రజల నుంచి అందిన సమస్యల పరిష్కారానికి మూడు నుంచి 90 రోజుల గడువు ఉంటుందన్నారు. ఆ గడువు లోగా ఆయా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వీణాదేవి సూచించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల్లో పది శాతం నోడల్ అధికారి, పది శాతం ఆశాఖ హెడ్‌వోడీలు తనిఖీ చేస్తారన్నారు. సమస్యల పరిష్కారంలో ఎదురయ్యే ఇబ్బందులు, సాంకేతికపరమైన సమస్యల గురించి అధికారులకు వివరించారు. నూరు శాతం సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు శాఖల సమస్యలపై ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్టు డీఎల్‌డీవో) ఎ.స్లీవారెడ్డి సూచించారు. ఎంపీడీవో కె.సుశీల, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరించండి

- సివిల్ సప్లయిస్ మేనేజింగ్ డైరెక్టర్ మలజీర్ జిలానీ సామూర్
- అనంతపల్లిలో రైసు మిల్లు, రైతు సేవా కేంద్రం పరిశీలన



రైస్ మిల్లు వద్ద ధాన్యం దిగుమతుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న సివిల్ సప్లయిస్ ఎండీ సామూర్

నల్లజర్ల: ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఏపీ సివిల్ సప్లయిస్ మేనేజింగ్ డైరెక్టర్ మలజీర్ జిలానీ సామూర్ అధికారులకు సూచించారు. అనంతపల్లి గ్రామంలోని ఎస్‌వీఎస్ గణేశ్ రైసు మిల్లును, రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ట్రాన్స్‌పోర్టు చార్జీలు, హమాలీ కూలి ఎవరి ఖాతాల్లో జమ చేస్తున్నారని ఆయన అడిగి తెలుసుకున్నారు. ట్రక్ షీట్ రాసిన మూడు గంటల్లోగా ధాన్యం మిల్లుకు చేరకపోవడంతో జీపీఎస్ సక్రమంగా పని చేస్తోందా? లేదా ఆరా తీశారు. ఇంతవరకూ ఈ మిల్లుకు ఎంత ధాన్యం వచ్చిందని సామూర్ ప్రశ్నించగా, 5,044 క్వింటాళ్లు వచ్చినట్టు వీఆర్వో రామసీత బదులిచ్చారు. వివిధ విషయాలపై సామూర్ ఆమెను ప్రశ్నించగా, ధాన్యం సేకరణపై తనకు శిక్షణ ఇవ్వలేదని సమాధానం చెప్పారు. దాంతో సివిల్ సప్లయిస్ ఎండీ అవాక్కయ్యారు. ధాన్యాన్ని ఎప్పుడు, ఎక్కడ విక్రయించుకోవాలో రైతులే నిర్ణయించుకునే విధంగా మొబైల్ ద్వారా కూపన్ సృష్టించుకునే సాంకేతికను ప్రవేశ పెట్టినట్టు వివరించారు. మిల్లు సామర్థ్యాన్ని బట్టి ధాన్యం ట్రక్ షీట్లు అందించాలని సూచించారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, సివిల్ సప్లయిస్ డీఎంటీ రాధిక, డీఎస్ఓ ప్రసాద్, ఏఎస్ఓ నాగాంజనేయులు, సీఎస్ డీటీ సత్యనారాయణ, తహసీల్దార్ కృష్ణారావు, ఏవో కమల్‌రాజ్ ఉన్నారు.

పీఆర్‌సీ వేసి రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలి

రిటైర్డ్ ఉద్యోగుల సంఘ జిల్లా కార్యవర్గం తీర్మానం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శాస్త్రి

దేవరపల్లి: పే రివిజన్ కమిషన్ (పీఆర్‌సీ)ను నియమించి రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలని ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. దేవరపల్లిలోని మండల రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ భవనంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్. సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ఎన్ శాస్త్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం రూ.26 వేల కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. పీఆర్‌సీని ఏర్పాటు చేసి ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని కోరారు. గతంలో వేసిన పీఆర్‌సీ నివేదిక బుట్టదాఖలైందని ఆయన చెప్పారు. కమ్యూనిటీ వాల్యూ పెన్షన్ (సీవీసీ) సమస్య మూడు పీఆర్‌సీల నుంచి ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కోర్టును ఆశ్రయించినట్టు తెలిపారు. మెడికల్ బిల్లు రీయింబర్స్‌మెంట్ రివైజ్ చేయాలని, ఆరోగ్య బీమా పథకం అమలు చేసి రూ.5 లక్షల వరకు వైద్యం అందించాలని, రిటైర్డ్ ఉద్యోగులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని, సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి బేసిక్ కమిషన్ నియమించాలని, రాష్ట్ర రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి 300 చదరపు గజాల స్థలం మంజూరు చేయాలని, ఫ్యామిలీ పెన్షనర్స్ డేట్ ఆఫ్ బర్త్ నమోదు చేయాలని సమావేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసినట్టు రాష్ట్ర అధ్యక్షులు శాస్త్రి తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేసినట్టు ఆయన తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సూర్యప్రకాశరావు కార్యదర్శి నివేదిక అందజేశారు. దేవరపల్లి మండల శాఖ నిర్మాణానికి కృషి చేసిన కేశిరాజు సీతారామయ్యను సమావేశంలో సన్మానించారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ముగ్గురు ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. జేమ్స్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సత్యనారాయణరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు పీఎస్ ప్రసాద్, కోశాధికారి డి. సాయిబాబా, దేవరపల్లి మండల శాఖ అధ్యక్షుడు పప్పు వెంకటరామారావు, గౌరవాధ్యక్షుడు సీతారామయ్య, పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

చినకాశిరేవు పరిశుభ్రం



చినకాశిరేవులో మొలకెత్తిన పచ్చగడ్డి (గతం)



పేరుకుపోయిన మట్టి (గతం)



శుభ్రపరిచిన తర్వాత చినకాశిరేవు

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు: 'సాక్షి' కథనానికి అధికార యంత్రాంగం కదలి వచ్చింది. పట్టణంలోని చినకాశి రేవును శుక్రవారం శుభ్రం చేశారు. పరిసరాల్లోని వ్యర్థాలన్నింటినీ సేకరించి కంపోస్టు యార్డుకు తరలించారు. 'చినకాశి రేవులో అన్నీ సమస్యలే ' అనే శీర్షికన 'సాక్షి'లో ఈనెల 19న ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ టి.కృష్ణవేణి ఆదేశాల మేరకు టౌన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ, సచివాలయ శానిటరీ కార్యదర్శి చదలవాడ సూర్యారావులు శుక్రవారం పారిశుధ్య కార్మికులను తీసుకు వెళ్లి చినకాశి రేవును పూర్తిగా శుభ్రం చేయించారు. ఇక్కడి ఐదు కాలువ రేవులపై ఉన్న మట్టిని, ఇతర వ్యర్థాలను తొలగించారు. చివరి రేవులో మొలకెత్తిన పచ్చగడ్డిని తీయించి, మెట్లను శుభ్రంగా కడిగారు. ఈ రేవులోని నాలుగు వీధి లైట్లలో మూడు వెలగకపోవడంతో వాటిని సరి చేశారు. రేవుల వద్ద విద్యుత్ లైట్లు వెలగడంతో గంగా స్నానాలకు వస్తున్న మహిళల ఇబ్బందులు తొలగిపోయాయి. దుస్తులు మార్చుకునే గదులను కూడా శుభ్రం చేయడంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చినకాశిరేవు పరిసరాలను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. మహిళా భక్తులు, వివిధ ఆలయాల్లో పని చేస్తున్న అర్చకులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

టీకాలపై అవగాహన పెంచండి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వరరావు
- కొవ్వూరులో సిబ్బందికి అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

కొవ్వూరు: వివిధ రకాల వ్యాధి నిరోధక టీకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు వైద్య సిబ్బందికి సూచించారు. వ్యాధి నిరోధక టీకాలపై శుక్రవారం స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు వ్యాక్సిన్‌లు వేసే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వైద్య సిబ్బందికి వివరించారు. ప్రస్తుతం 11 రకాల వ్యాధులు రాకుండా ఏడాది లోపు పిల్లలకు వ్యాక్సిన్‌లు వేయిస్తున్నామన్నారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం వ్యాక్సినేషన్ చేయాలని సూచించారు. బిడ్డకు వ్యాక్సిన్ ఇచ్చే క్రమంలో కోల్డ్ చైన్ సిస్టమ్ జాగ్రత్తగా ఉండాలన్నారు. గర్భిణులు, పిల్లలకు వేసే వ్యాక్సిన్‌ల వివరాలన్నింటినీ అదేరోజు యూడబ్ల్యూఐఎన్ పోర్టల్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. నూరు శాతం వ్యాక్సినేషన్ లక్ష్యంగా పని చేయాలని సిబ్బందికి సూచించారు. సదస్సులో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య, దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సమ్మీకుమార్, డాక్టర్లు హరిశ్చంద్రప్రసాద్, మౌనిక, నిషాంత్, సూపర్‌వైజర్లు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా అందించాలి

చాగల్లు: కార్డుదారులకు రేషన్ సరకులను సక్రమంగా అందజేయాలని పౌరసరఫరాల విభాగం డిప్యూటీ తహసీల్దార్ ఎం.సునీత సూచించారు. రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల సమీక్షా సమావేశాన్ని శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా డీటీ సునీత మాట్లాడుతూ ప్రతి కార్డుదారుడికీ ఉచిత బియ్యంతో పాటు కందిపప్పు రూ.67, పంచదార రూ.17 రేటుకు అందజేయాలన్నారు. సమావేశంలో డీటీ శ్రీనివాస్, రేషన్ డీలర్లు కె.సతీష్, కె.కృష్ణ, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన తయారీ కార్మికుల ఆందోళన



ఎంఈవో తిరుమలదాస్‌కు వినతిపత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన తయారీ కార్మికులు

దేవరపల్లి: పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజనం తయారీ కార్మికులు, స్వీపర్ల వేతన బకాయిలను తక్షణం చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు స్కూల్ స్వీపర్లు, మధ్యాహ్న భోజనం తయారీ కార్మికులు స్థానిక మండల విద్యావనరుల కార్యాలయం వద్ద శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం వారు ఎంఈఓ ఎం.తిరుమలదాస్‌కు వినపతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ స్కూల్ స్వీపర్లు, మధ్యాహ్న భోజనం తయారీ కార్మికులకు ప్రతినెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచి అమలు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకానికి వంట గ్యాస్ ఉచితంగా ఇస్తామని చెప్పిన హామీని అమలు చేయాలని మహిళలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్కూల్ స్వీపర్స్ మండల యూనియన్ నాయకులు వై. పుష్పకుమారి, గుడిమెట్ల విమల, సాధనాల గంగ, లింగంకుంట వెంకటలక్ష్మి, షేక్ కరీబి, యాళ్ల బుజ్జమ్మ, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు దుగ్గిన మాణిక్యం, ఎం. రాజకుమారి, షేక్ రంజాని, షేక్ మస్తాన్‌బీ పాల్గొన్నారు.

దాళ్వాలో కొత్త వరి వంగడం ఎంటీయూ 1426



రైతులకు కొత్త వరి వంగడం విత్తనాలు అందిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

నల్లజర్ల: మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం కొత్తగా రూపొందించిన ఎంటీయూ -1426 అనే వరి వంగడాన్ని ఈ ఏడాది దాళ్వాలో రైతులకు ప్రయోగాత్మకంగా అందజేస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు వెల్లడించారు. నల్లజర్లలో శుక్రవారం ఆయన అభ్యుదయ రైతులకు ఈ విత్తనాల మినీకిట్లు అందజేశారు. ఈ వరిరకం 120 రోజుల నుంచి 125 రోజులలో కోతకు వచ్చి హెక్టార్‌కు 6.5 నుండి 7 టన్నుల వరకు దిగుబడి వస్తుందన్నారు. అలాగే అగ్గి, ఎండాకు, ఉల్లికోడు, దోమపోటు తెగుళ్లను తట్టుకుంటుందన్నారు. ప్రస్తుతానికి సార్వా వరి కోతలు 50 శాతం పూర్తయ్యాయని, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టరు చల్లా వెంకట నరసింహారావు, డాక్టరు మానుకొండ శ్రీనివాస్, ఏడీఏలు పి.చంద్రశేఖర్, డీవీ కృష్ణ, ఏఓ కమల్‌రాజ్, ఏఈఓ పుష్పలత, వీఏఏ దుర్గాసురేష్, కె.ప్రభాకర్, రైతులు కూచిపూడి గంగరాజు, బుడిగిన ధర్మతేజ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.